క్లుప్తంగా

కేంద్రీయ విద్యాలయం ఉత్తీర్ణతపై కలెక్టర్ హర్షం



కలెక్టర్ కృతికా శుక్లా నుంచి కప్పు అందుకుంటున్న ప్రిన్సిపాల్ తదితరులు

కాకినాడ సిటీ: సీబీఎస్‌ఈ 2022-23 పదో తరగతి పరీక్షల్లో కాకినాడ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంపై కలెక్టర్ కృతికా శుక్లా హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యా సంస్థ ప్రిన్సిపల్ బొంత శేఖర్, ఉపాధ్యాయులు కలెక్టర్‌ను కలసి విద్యార్థులు సాధించిన ఘనతను వివరించారు. 48 మంది విద్యార్థులు పరీక్షలు రాసి అందరూ ఉత్తీర్ణులయ్యారని, వీరిలో 32 మంది ప్రథమ శ్రేణిలో పాసైయ్యారని ప్రిన్సిపాల్ వివరించారు. ఇందుకు కలెక్టర్, జిల్లా యంత్రాంగం నుంచి తమ సంస్థకు అందిన సహాయ సహకారాలు, ప్రోత్సాహానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. విద్యాలయం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కలెక్టర్ కృతికా శుక్లా అభినందనలు తెలిపారు.

మహా యజ్ఞానికి తరలిన భక్తులు



యహాయజ్ఞంలో పాల్గొన్న కాకినాడ భక్తులు

బోట్‌క్లబ్ : లోక కల్యాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మహా యజ్ఞానికి కాకినాడ బాలాత్రిపుర సుందరి సమేత రామ లింగేశ్వరస్వామి దేవస్థానం నుంచి మంగళవారం భక్తులు తరలివెళ్లారు. ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి 60 మంది భక్తులకు ఉచితంగా ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి భక్తులను పంపించారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న మహాయజ్ఞంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించిన ప్రభుత్వానికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి



ఉపాధి కూలీలకు మజ్జిగ అందజేస్తున్న సర్పంచ్ ఆశాజ్యోతి

కరప: ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో వడ గాడ్పుల బారిన పడకుండా ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అన్నారు. కరపలో మంగళవారం ఉపాధి పనులను పరిశీలించి, కూలీలకు పలు సూచనలిచ్చారు. ఎండలో ఎక్కువసమయం పని చేయవద్దని, తలకు రక్షణగా టోపీలుగానీ, తువ్వాలుతో తలపాగా చుట్టుకోవడం కానీ చేయాలన్నారు. మంచినీరు దగ్గరగా ఉంచుకోవాలన్నారు. ఏదైనా అవసరమైతే తనకు కానీ, వైద్య సిబ్బందికి కానీ సమాచారం ఇస్తే కావలసిన సాయం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా చల్లటి మజ్జిగను సర్పంచ్ పంపిణీచేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ వాసంశెట్టి రాము, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగను అందిస్తున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రవికృష్ణ

కాకినాడ సిటీ: రాగిరెడ్డి వెంకట జయరాంకుమార్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కాకినాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ మంగళవారం ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ పనులపై వచ్చిన ప్రజలకు మజ్జిగను అందజేసి నిర్వాహకుల సేవలను అభినందించారు. వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మంగా శివరామకృష్ణ, పాత్రికేయులు పాల్గొన్నారు.

ఆర్పీలకు శిక్షణ

సామర్లకోట: మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో సాంకేతిక సమస్యలను శిక్షణతో అధిగ మించాలని జిల్లా రిసోర్సు పర్సన్ ఎల్.జయరాజ్ అన్నారు. స్థానిక సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో మెప్మాలోని సామర్లకోట మున్సిపాలిటీ రిసోర్సు పర్సన్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ మంగళవారం ముగిసింది. మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాల అమలుపై ఆర్పీలకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని ప్రతీ మహిళా సంఘం తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకునే విధంగా చేయాలన్నారు.

గ్రీన్ చాంప్ @ పీఆర్ కాలేజ్

- హరిత వనాన్ని తలపించేలా కళాశాల ఆవరణ
- వేసవిలోనూ చల్లని నీడతో ముచ్చటగొలిపేలా పరిసరాలు
- అత్యవసరం అయినచోటే కాంక్రీట్ రహదారులు



బాలాజీచెరువు: నగరానికి నడిమధ్యలో సుమారు 28 ఎకరాల విస్తీర్ణం కలిగి 137 ఏళ్ల చరిత్ర కలిగిన పీఆర్ ప్రభుత్వ కళాశాల పచ్చదనానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది. 42 డిగ్రీల మండుటెండలో సైతం కళాశాల ఆవరణలో రెండు నుంచి మూడు డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయంటే అతిశయోక్తి కాదు. ఈ పరిస్థితుల దృష్ట్యా గ్రీన్ చాంపియన్‌షిప్ పురస్కారాన్ని కైవసం చేసుకుంది. మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్, ఉన్నత విద్యాశాఖ సంయుక్తంగా జిల్లాకు ఒక గ్రీన్ చాంపియన్ షిప్ అవార్డును ఎంపిక చేయడంలో భాగంగా గత ఏడాది కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థానం సాధించింది. నగరంలో అత్యధిక విస్తీర్ణంతో పాటు పచ్చని వృక్షాలు కలిగిన కళాశాలలు జేఎన్‌టీయూ, ప్రభుత్వ ఐటీఐ, ఏపీటీ, జీపీటీ కళాశాలలు ఉండగా పీఆర్ కళాశాలను గుర్తించారు.

శక్తి వనరులు వినియోగం..

నీటి యాజమాన్య నిర్వహణ, వ్యర్థాల యాజమాన్యం, శక్తి వనరుల వినియోగంలో సరైన విధానాన్ని ఇక్కడి యాజమాన్యం అవలంబిస్తోంది. ఆరోగ్యం-పరిశుభ్రత, పచ్చదనంతో పాటు రెండు ఆర్వో ప్లాంట్ల నిర్మాణం, వినియోగం లేదా వర్షపు నీరు నిల్వ లేకుండా ఇంకిపోయేందుకు మార్గాలు, సేకరించిన వ్యర్థాలు, కంపోస్ట్ ఎరువు తయారీ విధానం, తడి, పొడి చెత్త సేకరణతో పాటు కళాశాల అవరణలో దాదాపు 500 మొక్కలకు పైగా పెంచి పచ్చదనంతో ఉండటం వల్ల ఇక్కడి వాతావరణం చల్లగా ఉంటుంది. ముఖ్యమైన ప్రాంతాల్లో తప్ప కాంక్రీట్ రహదారులు లేకుండా వాకింగ్ ట్రాక్‌తో సహా మట్టిరోడ్లు వేసి మొక్కల పెంపుదలకు కృషిచేయడం వల్ల కళాశాల క్యాంపస్ పచ్చదనాన్ని సంతరించుకుంటోంది.

వేసవిలోనూ చల్లదనం



కళాశాలలో డిగ్రీ, పీజీ స్థాయిలో ఉన్న 2 వేల మంది విద్యార్థులు, అధ్యాపకులు, నాలుగు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల సహకారంతో కళాశాలలో పచ్చని వాతావరణం కల్పించడం సాధ్యమైయింది. కళాశాలను నగరానికి గ్రీన్ అంబాసిడర్‌గా తయారు చేసి ఆదర్శంగా నిలపడానికి అందరి సహకారంతో కృషి చేస్తాం. నగర వాతావరణం కంటే కళాశాల అవరణంలో రెండు శాతం ఉష్ణోగ్రత మార్పు రావడం సంతోషం.

– డాక్టర్ పసుపులేటి హరిరామ ప్రసాద్, హిందీ విభాగాధిపతి

ఫ్లడ్ లైట్లలో సమ్మర్ క్రికెట్ టోర్నీ



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో క్రికెట్ కార్నివాల్ పేరుతో ఏర్పాటు చేసిన సమ్మర్ క్రికెట్ టోర్నీని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు ప్రారంభించారు. కరపలో మొదటిసారిగా ఫ్లడ్ లైట్లతో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ నాకౌట్ టోర్నీలో కరప, కాజులూరు మండలాల నుంచి 40 జట్లు తలపడుతున్నాయి. ఒక్కొక్క జట్టులో 8 మంది క్రీడాకారులుంటారని, ఒక్కొక్క మ్యాచ్ ఆరు ఓవర్లు ఆడతారని నిర్వాహకులు డాక్టర్ మేడిశెట్టి స్వరూప్, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, మేడిశెట్టి కిరణ్, వీరేంద్ర, నాగేంద్ర తెలిపారు. ఐదు రోజుల పాటు ఈ టోర్నీ ఉంటుందన్నారు. విజేత జట్టుకు రూ.25 వేలు, రన్నర్స్‌కు రూ.15 వేలు నగదు, ట్రోఫీని అందజేస్తామన్నారు. వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, డాక్టర్ బొండా సూర్యారావు, రెడ్డిపల్లి రమేష్, సాదే లోహిదాస్ కుమార్, కుంపట్ల గోపాల్, పబ్బినీడి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలి

- వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మెరుగ్గా పనిచేయాలి
- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కన్నబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: పేదల సంక్షేమానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అర్హులందరికీ వాటిని అందించాల్సిందేనని ఇందుకు క్షేత్ర స్థాయిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మెరుగ్గా పనిచేయాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఉదయం సర్పవరం వలంటీర్లు, సచివాలయ సబ్బందితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించి, తొలుత వారిని అభినందించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి వస్తున్న వినతులు, పథకాల అమలులో ప్రతిబంధకాలను వారి నుంచి తెలుసుకున్నారు. కన్నబాబు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యలతో పాటు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. పథకాల వర్తింపునకు ప్రతిబంధంగా ఉన్న 300 యూనిట్లు విద్యుత్ పరిమితి, ఆదాయపు పన్ను, తదితర అంశాలతో కొందరు అనర్హులవుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనిపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందిచారని, త్వరలో కొన్ని సడలింపులు వచ్చే అవకాశం ఉందని, అర్హులైన వారు ఏ ఒక్కరికి అన్యాయం జరగరాదన్నారు. సర్పవరం వలంటీర్ల పనితీరు బాగుందని ప్రశంసించారు. డీఎల్‌డీఓ నారాయణ మూర్తి మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వద్దని, అనర్హుల పట్ల సానుకూలంగా వ్యవహరించి అర్హులయ్యేలా ప్రతిపాదించాలన్నారు. పార్టీ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ మాట్లాడుతూ వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. సర్పవరం సర్పంచ్ శీలం చిన్నా, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, ఎంపీటీసీ గుత్తుల శ్రీనివాస్, నాయకులు పుల్ల చందు, పుల్ల కోటేశ్వర రావు, పుల్ల చక్రధర్, కొప్పిశెట్టి గంగాధర్, కొప్పిశెట్టి శివరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతిగృహాల అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ కృతికా శుక్లా
- బాలికల వసతిగృహం ప్రారంభం



వసతిగృహాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి, వసతి గృహాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. మంగళవారం జగన్నాథపురంలో నిర్మించిన ధీరుబాయ్ అంబానీ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం-1ను ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జిల్లా ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎం.పవన్‌కుమార్, బి.వీర లింగేశ్వరరావు, పిల్లి జ్యోతి, సంక్షేమశాఖ అధికారులతో కలసి ప్రారంభించారు. రూ.60 లక్షల రిలయన్స్ సంస్థ సీఎస్సార్ నిధులతో కళాశాల వసతి గృహాన్ని అతి తక్కువ సమయంలో ఆరు నెలల కాలంలోనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల భవనాల బలోపేతానికి ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో ఆధునీకరణ పనులు చేపట్టినట్టు తెలిపారు. కాకినాడ ఆనంద నిలయంలో పెద్ద డార్మెటరీని ఇటీవలే వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. లోక్‌సభ మాజీ స్పీకర్ స్వర్గీయ జీఎంసీ బాలయోగి కాకినాడలో చదివిన అంబేద్కర్ వసతి గృహాన్ని కూడా రూ.కోటితో ఆధునీకరిస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. రిలయన్స్ కాకినాడ హెడ్ అక్షయ బక్ష, సీఎస్సార్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం, సాంఘిక సంక్షేమశాఖ జేడీ జె.రంగలక్ష్మీదేవి, ఏఎస్ డబ్ల్యూలు జి.జాన్‌బాబు, పీఎస్‌వీ సత్యనారాయణ, వాణి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టండి



డెంగీపై అవగాహన ర్యాలీ చేస్తున్న కరప పీహెచ్‌సీ సిబ్బంది



డెంగీ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్

కాకినాడ క్రైం: కాకినాడ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డెంగ్ నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రమేష్ ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ ప్రారంభించారు. కాకినాడలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రారంభమైన ఈ ర్యాలీ జిల్లా పరిషత్ కూడలి వరకు సాగింది. అనంతర జిల్లా పరిషత్ కార్యాలయంలో మూడు జిల్లాల డీఎంహెచ్‌వోలు, జిల్లా పరిషత్ అధికారులు డెంగ్ అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు.

ఘనంగా డెంగీ నివారణ దినోత్సవం

కరప: డెంగీ, చికున్‌గున్యా వ్యాప్తిచెందకుండా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలు దోమల నిరోధానికి చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తూ, రక్షితనీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని సూచించారు. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు కన్పిస్తే డెంగీగా గుర్తించి, వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకొస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్ ఈఓ డీఎల్ గంగాధర్, సీహెచ్ఓ వై.రత్నకుమారి, పీహెచ్‌ఎన్ టి.బాలాత్రిపురసుందరి, సూపర్‌వైజర్లు కె.రాధాకృష్ణ, కె.రాజగోపాలరావు తదితదరులు పాల్గొన్నారు. వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య ఆధ్వర్యంలో డెంగీ దినోత్సవం సందర్భంగా సిబ్బందితో కల్సి వాకాడలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా ఎస్‌యూఓ వై.డానియల్, షకీనా, వీర లక్ష్మి, లావణ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో దోమల మందు పిచికారీ

మండల పరిధిలో ఎంపీడీఓ కర్రె స్వప్న ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనుల డ్రైవ్‌లో భాగంగా మంగళవారం పలు గ్రామాల్లోని డ్రెయిన్లలో దోమల మందు పిచికారీ చేయించారు. నీరు తొలగించేందుకు వీలులేని ప్రదేశాల్లో, కుంటలలో ఆయిల్ బాల్స్ వదిలారు. సాయంత్రం దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రాణాలతో చెలగాటం వద్దు

- అత్యంత జాగ్రత్తగా వాహనం నడపాలి
- డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి
- ఆటో, లారీ డ్రైవర్లకు అవగాహన సదస్సు





ఆటో, లారీ డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి. చిత్రంలో సీఐ మురళీకృష్ణ, సదస్సుకు హాజరైన ఆటో, లారీ డ్రైవర్లు, యూనియన్ల నాయకులు

కాకినాడ రూరల్: వాహనం నడిపేటపుడు జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ పి.మురళీకృష్ణారెడ్డి ఆటో, లారీ డ్రైవర్లకు సూచించారు. సర్పవరం జంక్షన్‌లో స్పందన ఫంక్షన్ హాలులో సర్పవరం పోలీసు స్టేషన్ పరిధిలో 10 ఆటో యూనిట్ల నాయకులు, డ్రైవర్లు, లారీ, ట్యాంకర్ల యూనియన్ల డ్రైవర్లకు మంగళవారం సీఐ ఆకుల మురళీకృష్ణ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు పెట్టారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు సమారు 3 వందల మంది డ్రైవర్లకు అవగాహన కల్పించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ ఇటీవల తాళ్లరేవులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు డ్రైవర్ నిద్రపోవడం, లైసెన్స్ లేని క్లీనర్ మద్యం తాగి బస్సు నడపడమే కారణం అన్నారు. ఆటోలో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించడం వల్ల డ్రైవర్‌కు ప్రమాదం నుంచి తప్పించేందుకు అవకాశం లేకుండా పోయిందని, దీని వల్ల ఏడుగురు మృతి చెందగా, మిగిలిన ఏడుగురిలో ఇద్దరికి సీరియస్‌గా ఉందన్నారు. ఆటో, లారీ డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని, డ్రైవర్లందరూ లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు వాహనానికి బీమా చేయించాలన్నారు. ఎక్కడిపడితే అక్కడ సడన్‌గా ఆటోలను ఆపవద్దని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, రికార్డులు సక్రమంగా ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆటో, లారీ యూనియన్ల నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బీవీ రమణ

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వేకు సంబంధించి భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయాలని ఆర్డీవో బీవీ రమణ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సర్వే రాళ్లు పాతే కార్యక్రమం త్వరితగతిన చేపట్టాలని, మీ సేవ పెండింగ్ దరఖాస్తులపై నిర్ణీత గడువులో చర్య తీసుకోవాలన్నారు. మ్యుటేషన్ ప్రక్రియ చేపట్టాలని, అదే విధంగా ఓటీఎస్ దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో ప్రగతి చూపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డివిజన్‌లోని మండల తహసీల్దార్లు, పరిపాలనాధికారి జి.వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ ఫలాలు



కరపలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ప్రభుత్వపరంగా ప్రతి కుటుంబానికి ఆర్థిక చేయూతనిచ్చి, అండగా నిలవాలన్న సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా మంగళవారం ఐదో రోజు ఆయన స్థానిక నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో కల్సి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారునికి ఏయే పథకం ద్వారా ఎంత లబ్ధి చేకూరుతుందీ వివరించి, ఆ సొమ్ములు అందాయా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. ముందుగా మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పించి, గడప, గడపకూ మనప్రభుత్వం నిర్వహించారు. అరుంధతీ వీధి, సీతమ్మ వీధి, పల్లపువీధి, శివాలయం వీధి ఇతర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ఎక్కడకు వెళ్లినా, ఏ గడప తట్టినా ప్రతి కుటుంబం నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కావాలని, డ్రైన్లు నిర్మించాలని, కమ్యూనిటీ హాలు కావాలని కోరారని, ప్రాధాన్య క్రమంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ముందుగా ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీటీసీ మద్దూరి గంగాభవాని, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు స్వాగతం పలికి , ఇంటింటికీ తీసుకెళ్లారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్‌లు రొక్కాల గణేష్, వాసంశెట్టి కొండ, నాగిరెడ్డి ఏసుబాబు, వాసంశెట్టి రామారావు, శ్రీనుబాబు, పార్టీ నాయకులు సాదే లోహిదాస్ కుమార్, పెంకే సత్తిబాబు, నక్కా భద్రం, మద్దూరి భాస్కర్, నక్కా సత్తిబాబు, పుణ్యమంతుల గంగరాజు, కొత్త రవి, చింతా బుజ్జి, పెద్దింటి సుజాత, డి.సూర్యప్రకాష్, బొమ్మిడి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించండి

కమిషనర్ మహేష్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ కోరారు. గృహ నిర్మాణ ప్రగతిపై హౌసింగ్, మెప్మా, నగర పాలక సంస్థ అధికారులతో మంగళవారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఈ అంశంపై ఆయన సమీక్షించారు. వివిధ లే అవుట్లకు సంబంధించి ఆయా కాంట్రాక్టర్ల ప్రగతిని సమీక్షిస్తూ నిర్మాణాలను వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కాంట్రాక్టర్లకు, హౌసింగ్ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రస్తుతం గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలంటే అవసరం మేరకు బ్రిక్స్ సరఫరా పెంచుకోవాలన్నారు. లే అవుట్‌లో ఏర్పాటు చేసిన నాలుగు యూనిట్లలోని రెండు షిఫ్టులుగా బ్రిక్స్ ఉత్పత్తి చేయాలని, అక్కడే పని చేస్తున్న కాంట్రాక్టర్లు ఒక అంగీకారానికి వచ్చి వారికి అవసరమైన బ్రిక్స్‌ను వారే తయారు చేసుకునేలా సిబ్బంది సహకరించాలని కమిషనర్ ఆదేశించారు. జిల్లా హౌసింగ్ పథక సంచాలకుడు సుధాకర్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధిక సంఖ్యలో గృహ నిర్మాణాలు చేపట్టాలన్నారు. దీనికి అవసరమైన లేబర్‌ను నియమించుకుని రోజువారి లక్ష్యాలకు అనుగుణంగా వివిధ స్థాయిల్లో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను కోరారు. అడిషనల్ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారులైన స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35 వేల బ్యాంకు లింకేజీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. 9,622 మంది సభ్యులకు 5,249 మందికి మాత్రమే బ్యాంకు లింకేజీ అందిందన్నారు. మిగిలిన వారికి లింకేజీ విషయంలో బ్యాంకర్లతో సంప్రదించాలన్నారు. కొమరిగిరి, ఏపీ త్రయం, పండూరు లే అవుట్లకు సంబంధించి సుమారు 9,400 మందికి ఇప్పటికే గృహనిర్మాణాలకు ఆమోదం తెలిపారన్నారు. గృహ నిర్మాణశాఖ ఈఈ గుప్త, డీఈ కె సత్యనారాయణ రెడ్డి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ వెంకటరాజు, ఏఈలు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై సమీక్ష

నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ మహేష్‌కుమార్ అధ్యక్షతన రహదారి భద్రత కో-ఆర్డినేషన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, జిల్లా రవాణా అధికారి, ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీరింగ్ అధికారులు, డిప్యూటీ సిటీ ప్లానర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ తదితరులు పాల్గొన్నారు. కాకినాడ పరిధిలోని మెయిన్ రోడ్డు టూ టౌన్ నుంచి జగన్నాథపురం బ్రిడ్జి వరకు గల ట్రాఫిక్ ఇబ్బందులపై చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.